నేడు వర్సిటీ వజ్రోత్సవ సభ

హాజరుకానున్న సీఎం

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 19: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 60 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 20,21తేదీల్లో జరుపుకుంటున్నట్లు వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్నికి ముఖ్యఅతిథులుగా గవర్నర్ డా. జిష్ణు దేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలు విశ్వవిద్యాలయం ఆడిటోరియం, క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నారు.

పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల

వర్సిటీ వజ్రోత్సవాలు ఈ నెల 20, 21న జరుగనున్నందున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పనులను పర్యవేక్షించారు. ప్రత్యేక నిధులతో రోడ్ల నిర్మాణం, ఆడిటోరియం, క్రీడా ప్రాంగణంలో సభ ఏర్పాట్లు తదితర అంశాలను పర్యవేక్షించారు.

22న మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మహాసభలు

హిమాయత్‌నగర్,డిసెంబర్19: మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నిర్మాణ మహా సభలు ఈ నెల 22న హిమాయత్‌నగర్ లోని ఎస్ ఎన్‌రెడ్డి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేంపావని,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 26 వేల పై చిలుకు ప్రభుత్వ స్కూల్స్‌లో అమలవుతున్న ఈ పథకంలో 54,201 మంది మహిళా వంట కార్మికులు పనిచేస్తున్నారని,వీరి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం యూనియన్ కృషి చేస్తుందన్నారు.ఈ మహాసభలో పలు అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం నగరంలోని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా క్షమాపణలు చెప్పాలని.. కేంద్ర క్యాబినెట్ నుంచి అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. (జూబ్లీహిల్స్,డిసెంబర్ 19)

పార్కులోకి ప్రవహిస్తున్న మురుగునీరు

కొత్తగా జీహెచ్‌ఎంసీ పార్కులోకి సీవరేజ్‌లైన్ వేస్తున్న దృశ్యం

పార్కులో ఎక్కడ చూసినా మ్యాన్‌హోళ్లు

జీహెచ్‌ఎంసీ పార్కులపై నిర్లక్ష్యపు నీడ

- అధికారుల సమన్వయలేమితో పార్కుల్లో మురుగునీరు
- సీఎం ఇంటికి కూతవేటు దూరంలోపార్కు దుస్థితి
- జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45లో సీవరేజ్ లైన్ డామేజీ
- వరదనీటి లైన్లోకి డ్రైనేజీ కనెక్షన్లు

బంజారాహిల్స్,డిసెంబర్ 19: 'జీహెచ్‌ఎంసీలో పార్కు స్థలాలను కాపాడడంతో పాటు పరిశుభ్రంగా మార్చాలి..'అంటూ ఒకవైపు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. 'పార్కుల చుట్టూ ప్రహరీలు నిర్మించాలని, ఫెన్సింగ్ వేయాలంటూ..' అధికారుల సమీక్షా సమావేశాల్లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పార్కుల నిర్వహణ మాత్రం అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికే అభివృద్ధి చేసిన పార్కుల్లో కొన్ని చెత్తా చెదారంతో నిండిపోగా మరి కొన్ని పార్కుల్లోకి జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాలకు చెందిన పైపులైన్లను వదిలిపెట్టడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి సమీపంలో ఉన్న ఓ పార్కులోకి మురుగునీరు ప్రవహిస్తుండడంతో పాటు ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకుండా జలమండలికి చెందిన భారీ సీవరేజ్‌లైన్ సదరు పార్కులోకి కలిపేందుకు పనులు చేస్తున్నారు.

❖ జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45లోని ఆత్మకూరి రామారావు భారతీయ విద్యాభవన్ ఎదురుగా జూబ్లీహిల్స్ సొసైటీ పరిధిలోకి వచ్చే సుమారు ఎకరంన్నర పార్కు స్థలం ఉంది. గతంలోనే ఈ పార్కులో మొక్కలు నాటడంతో పాటు మెట్లను నిర్మించి వాకర్లు నడిచేలా ఏర్పాట్లు చేశారు. దీని చుట్టూ ప్రహరీ గోడ సైతం నిర్మించారు. రెండు నెలలుగా పార్కు చుట్టూ ఉన్న ప్రహరీని కూల్చేయడంతో పాటు మట్టిని డంపింగ్ చేశారు. పార్కుకు ఆనుకుని ఉన్న స్థలంలో శేరిలింగంపల్లి జోన్ జీహెచ్‌ఎంసీ అధికారులు ఓ నిర్మాణాన్ని చేపట్టడంతో దానికి సంబంధించిన లారీలు తిరిగేందుకు ప్రహరీ గోడలు కూల్చేశారు.

మురుగునీటితో కొత్త ముప్పు..?

జీహెచ్‌ఎంసీ సర్కిల్-18పరిధిలోకి వచ్చే ఈ పార్కులోకి మూడు నెలలుగా జీహెచ్‌ఎంసీకి చెందిన వరదనీటి పైపులైన్ వదిలిపెట్టారు. వాస్తవానికి వర్షం వచ్చినప్పుడు మాత్రమే వరదనీరు వచ్చి పార్కులోని ఇంకుడు గుంతలోకి చేరేలా దీన్ని ఏర్పాటు చేశారు. అయితే జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45లోని గీతా ఆర్ట్స్ కార్యాలయం నుంచి భారతీయ విద్యా భవన్ స్కూల్ వరకు పెద్ద ఎత్తున నిర్మాణాలు రావడం, పబ్‌లు, రెస్టారెంట్లను ఏర్పాటు చేయడంతో వాటికి సంబంధించిన సీవరేజ్ లైన్లు మొత్తం జీహెచ్‌ఎంసీ వరదనీటి పైప్‌లైన్‌లో కలిపేశారు. ఈ రోడ్డులో కొత్తగా వచ్చిన దుర్గం చెరువు ఫ్లైఓవర్ నిర్మాణం సమయంలో డ్రైనేజీ లైన్ మొత్తం డామేజీ కావడంతో ఆ కనెక్షన్లన్నీ అక్రమంగా జీహెచ్‌ఎంసీ వరదనీటి కాలువలో కలిపివేశారు. దీంతో సుమారు 20కి పైగా బహుళ అంతస్తుల నిర్మాణాలు,పబ్స్, రెస్టారెంట్లకు సంబంధించినసీవరేజ్ మొత్తం నేరుగా జీహెచ్‌ఎంసీ వరదనీటి లైన్ ద్వారా పార్కులోకి చేరుతుండడంతో విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోంది.

దీనికి తోడు మంగోలియా బేకరి వైపునుంచి మాదాపూర్ వైపు కొత్తగా సీవరేజ్ లైన్‌ను నేరుగా తీసుకొచ్చి జీహెచ్‌ఎంసీ పార్కులోకి కలుపుతున్నారు. ఇప్పుడు మరింత ఎక్కువ మొత్తంలో వచ్చే సీవరేజ్ కోసం పార్కుస్థలంలో తవ్వకాలు జరిపి కొత్త సీవరేజ్ లైన్ నిర్మాణం చేపట్టారు.

సీవరేజ్ లైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం

జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45లోని గీతా ఆర్ట్స్ నుంచి భారతీయ విద్యాభవన్ వైపు సీవరేజ్ లైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. గతంలో ఫ్లైఓవర్ నిర్మాణం సందర్భంగా ఇక్కడి లైన్ ధ్వంసమైంది. దాంతో అక్కడిలైన్లు మొత్తం నిండిపోయి తరచూ ప్రధాన రోడ్డుపై మురుగునీరు పొంగుతోంది. అలాంటి లైన్లను వెంటనే తొలగించాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరుతున్నాం. రోడ్డు కటింగ్ అనుమతులు రాగానే సీవరేజ్‌లైన్ వేస్తాం. జీహెచ్‌ఎంసీ పార్కు స్థలంలోనుంచి సీవరేజ్ లైన్ నిర్మాణం చేస్తున్నాం.దాన్ని కిందిభాగంలో ఉన్న ఎస్‌టీపీ ద్వారా దుర్గం చెరువు ఎస్టీపీలోకి పంపించేలా చూస్తున్నాం.

– హరిశంకర్. జీఎం, జలమండలి

ఎయిర్‌పోర్టులో పర్యాటక సమాచార కేంద్రం ప్రారంభం

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 19: దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేందుకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పర్యాటక సమాచారం కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన వారసత్వ ప్రదేశాలు, సుసంపన్నమైన సాంస్కృతిక వైవిధ్యం, అబ్బురపరిచే ప్రకృతి దృశ్యాలను సందర్శించేందుకు వచ్చే దేశీయ, విదేశీయ సందర్శకుల కోసం రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలు, హరిత హోటల్స్, టూర్ ప్యాకేజీలు, రిజర్వేషన్ మేళా మార్గాలు వంటి సమాచారాన్ని అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఈ సమాచార కేంద్రం ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మేనేజింగ్ డైరక్టర్ ప్రకాశ్ రెడ్డి,పర్యాటక శాఖ సంచనాలు హన్మం తు, జీఎంఆర్ ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ ఫణికర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు రూపాయల భోజనం ఏర్పాటు చేయాలి

శంషాబాద్ పట్టణంలో ఐదు రూపాయల భోజన సెంటర్ ఏర్పాటు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు,భవన నిర్మాణ కార్మికులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 19 : శంషాబాద్ కూలీల అడ్డ వద్ద ఐదు రూపాయల భోజనం సెంటర్ ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు పానుగంటి పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం శంషాబాద్ పట్టణంలో ఐదు రూపాయల భోజనం ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి నర్ర గిరి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా నాయకుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ కొంతకాలం నుంచి శంషాబాద్ పట్టణంలోని కూలీల అడ్డ వద్ద ఐదు రూపాయల భోజనం సెంటర్ ఏర్పాటు చేయాలని అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఐదు రూపాయల భోజన వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎన్ మల్లేష్, చందునాయక్,రాజు, సురేష్‌నాయక్‌లతో పాటు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉపాధికి సహకారం

అమీర్‌పేట్:టెక్ మహేంద్ర ఫౌండేషన్ వారి డిజిటల్ అకాడమీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుస్) రీ/ స్టార్ట్ కార్యక్రమంలో భాగంగా ఉచిత శిక్షణ, సర్టిఫికేషన్, ప్లేస్‌మెంట్ సహకారాన్ని అందిస్తోంది. ఈ ఉచిత శిక్షణ పొందేందుకు బీఈ, బీటెక్, బీఎస్‌సి కంప్యూటర్స్ (2022- 23- 24) సంవత్సరాల్లో పూర్తి చేసిన వారు అర్హులని, అభ్యర్థుల ఎంపిక ప్రవేశ పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుందని, మరిన్ని వివరాలకు టెక్ మహేంద్ర క్యాంపస్, క్లాక్ టవర్ సమీపంలోని సెబాస్టియన్ రోడ్, మెట్రో పిల్లర్ నెంబర్ 941 సమీపంలోని ఓఫ్రీ టవర్స్‌లో 7337332605, 733061372లో సంప్రదించాలని కోరుతున్నారు.

పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్య తప్పనిసరి

మోర్డు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 19 : నేడు పోటీ ప్రపంచంలో కంప్యూటర్ రాణించడం తప్పనిసరి అవసరమని మోర్డు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం శంషాబాద్ పట్టణంలోని పాతపోలీస్‌స్టేషన్ సమీపంలో సీఎస్‌సీ అకాడమీ చైర్మన్ సయ్యద్ జాఫర్ అలీ ఆధ్వర్యంలో యువతకు కంప్యూటర్ కోర్స్‌లలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు గా డాక్టర్ శ్రీనివాస్ ముఖ్యఅతిథి హాజరై వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు పోటీ ప్రపంచంతో ప్రతి ఒక్కరికి కంప్యూటర్ నేర్చుకోవడం తప్పనిసరిగా అయిందన్నారు. ఎక్కడ చూసినా కంప్యూటర్‌తోనే పనులు చేస్తున్నారని వివరించారు. తక్కువ ఫీజులతో కంప్యూటర్ కోర్స్‌లలో శిక్షణ ఇస్తున్న జాఫర్ అలీని అభినందించారు. ఇలాంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంప్యూటర్ కోర్స్‌లో శిక్షణపూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్, తదితరులు

నార్సింగి మున్సిపాలిటీకి 'ద చేంజ్ మేకర్ అవార్డు'

మణికొండ, డిసెంబర్ 19 : స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా ఢిల్లీలో గురువారం జరిగిన సదస్సులో నార్సింగి మున్సిపాలిటీకి ' ద చేంజ్ మేకర్ అవార్డు' దక్కింది. ఈ అవార్డును మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణ మోహన్‌రెడ్డికి నిర్వాహకులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నార్సింగి మున్సిపాలిటీని అన్నిరంగాలల్లో అభివృద్ధి పర్చేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పనిచేయడంతోనే ద ఛేంజ్ మేకర్ అవార్డు మున్సిపాలిటీ కి దక్కిందన్నారు. స్వచ్ఛత విషయంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఆదర్శనీయమైనవన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు సహకారం కూడా చాలా ఉందని కమిషనర్ గుర్తుచేశారు. ఈ అవార్డు మున్సిపాలిటీ ప్రజలకే అంకితమని తెలిపారు.

ఢిల్లీలో 'ద ఛేంజ్ మేకర్ అవార్డు'ను అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి

మానవుని మనుగడకు అండగా పశుపోషణ

సెంట్రల్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ. బాసుతకర్ జగదీశ్వర్ రావు

సావనీరును విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ డా. శరత్ చంద్ర తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ ,డిసెంబర్ 19: దేశ వ్యాప్తంగా పశు సంపదను కాపాడుతూ, పరాన్న జీవులు పశువుల నుంచి మానవునికి సోకకుండా వాటి నివారణకు మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొ.జగదీశ్వర్ రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం లో పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం , కళాశాల 33వ నేషనల్ కాంగ్రెస్ నేషనల్ సింపోజియం ఆఫ్ పారాసిటాలజీ అనే అంశంపై మూడో రోజు ముగింపు కార్యక్రమంలో సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఆయా రాష్ట్రాలలో గల వాతావరణ పరిస్థితులు, పశుపోషణను దృష్టిలో ఉంచుకుని దేశ వ్యాప్తంగా పరాన్న జీవుల ప్రభావం పై శాస్త్రవేత్తలు మరిన్ని పరిశోధనలు జరపాలన్నారు. ఇలాంటి సదస్సుల వల్ల పరాన్న జీవులపై జరుగుతున్న పరిశోధనలు , ఆవిష్కరణలు ,దేశ వ్యాప్తంగా పంచుకోవడం, విద్యార్థులు, శాస్త్రవేత్తలు ,సరికొత్త ఆలోచనల ధోరణి మెరుగు పర్చడంలో సహాయ ం పడుతుందని పేర్కొన్నారు. వివిధ విభాగాలలో ప్రతిభ కనబర్చిన అధ్యాపకులకు , విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఫ్యాకల్టీ డీన్, సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి డా. ఉదయ కుమార్, కళాశాల అసోసియేట్ డీన్ డా. మాధురి,పశు సంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డా. సుబ్బారాయుడు , విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. హరికృష్ణ, విస్తరణ సంచాలకులు డా. కిషన్ కుమార్,దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ఆశాఖ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణతో 33వ సారి శబరిమలకు..

మోతీనగర్ ప్రాంతానికి చెందిన శివప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో 36 మంది అయ్యప్ప భక్తులు గురువారం శబరిమలకు పయనమయ్యారు. అందులో మాలధారణ, ఇరుముడితో శివప్రసాద్ 33వ సారి ఈ యాత్రకు వెళ్లటం విశేషం. మిగితా భక్తుల్లో హోటల్ శ్రీను 24వ పడి, కృష్ణ 19వ పడి.. బోరబండ, మోతీనగర్ ప్రాంతానికి చెందిన ఈ 36 మంది అయ్యప్ప భక్తులు శ్రీనగర్ కాలనీలో శ్రీనివాస్ గురుస్వామి వద్ద పవిత్ర ఇరుముడి ధరించి అక్కడినుంచి శబరికి పయనమయ్యారు. యాత్రకు వెళ్లిన వాళ్లలో శివప్రసాద్, హోటల్ శ్రీను, కృష్ణతో పాటు దామోదర్ నాయుడు, సుబ్రహ్మణ్యం తదితరులున్నారు. – ఎర్రగడ్డ, డిసెంబర్ 19:

లగచర్ల రైతుల విజయం

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని తెలంగాణ భవన్‌లో కలిసిన యువ నాయకుడు గుంటి చరణ్

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 19 : లగచర్ల రైతుల భూములు అన్యాయంగా లాకోవడం కోసం యత్నిస్తున్న సమయంలో గిరిజన రైతులు వారి భూములు ఇవ్వమని అడ్డుచెప్పడంతో పాటు బలవంతంగా భూములు లాకోవడానికి వచ్చిన అధికారులపై కొంతమంది దాడులు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయా తండాలకు చెందిన గిరిజన రైతులపై అక్రమ కేసులు బనాయించిన సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేశారు. అయితే మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో పాటు లగచర్ల రైతులకు బెయిల్ మంజూరు చేయడంతో గురువారం జైలు నుంచి విడుదలైన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని శంషాబాద్ యువ నాయకుడు గుంటి చరణ్ తెలంగాణ భవన్‌లో కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా ప్రజాకోర్టులో శిక్షతప్పదని హెచ్చరించారు.

ఇంటిపై నుంచి దూకి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 19: ఇంటి పై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. స్థానికులు ,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన సంపంగి పెద్ద యాదయ్య కొడుకు అర్జున్(28) జీ1 వెంచర్‌లోని వాళ్ల ఇంటి పై నాలుగో అంతస్తు పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకొని మృతి చెందారు. అతడు గతంలో ఎయిర్‌పోర్టులో ఉద్యోగం చేసేవాడు. ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీ గా ఉంటున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాడు ఖజానా ఫుల్...నేడు నిల్

- నిధులు లేక...మల్లగుల్లాలు
- వాయిదా పడిన మణికొండ కౌన్సిల్ చివరి సమావేశం
- డిసెంబర్ 27న సమావేశం నిర్వహిస్తామంటున్న అధికారులు

మణికొండ, డిసెంబర్ 19 : ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక బడ్జెట్ కలిగిన మణికొండ మున్సిపాలిటీ మొట్టమొదటిసారిగా నిధులలేమితో చతికిలపడటం మరోరికార్డుకు శ్రీకారం చుట్టింది. మణికొండ అంటేనే కాసుల కొండ అని అంతా అనుకుంటారు. కానీ నిధుల కన్నా చెల్లింపులే అధికమయ్యాయంటూ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. గురువారం జరగాల్సిన మణికొండ మున్సిపాలిటీ చివరి కౌన్సిల్ సమావేశం డిసెంబర్ 27కు వాయిదాపడింది. వచ్చే ఏడాది జనవరి 20న మున్సిపాలిటీ పాలకవర్గ పదవీ కాలం ముగియనుండటంతో చివరి సమావేశంలో పెండింగ్ బిల్లుల చెల్లింపులు, కొనసాగుతున్న పనులకు, కొత్తగా వార్డులల్లో అవసరమైన బడ్జెట్‌ను కేటాయించేందుకు చొరవ చూపాలంటూ ఇప్పటికే అన్ని వార్డుల కౌన్సిలర్లు కమిషనర్ ప్రదీప్‌కుమార్ విన్నవించారు. కానీ ఆశించిన స్థాయిలో మున్సిపాలిటీలో బడ్జెట్ లేకపోవడంతో చివరి సమావేశంలో చెత్త నిర్వహణకే అధిక నిధులిచ్చేందుకు అధికారులు సిద్ధమైనట్లు ఇప్పటికే సోషల్ మీడియాలో చర్చకావడంతో..తమ వార్డులకు ఎందుకు నిధులు కేటాయించారంటూ కౌన్సిలర్లు నిలదీసేందుకు సమాయత్తమయ్యారు. కానీ చివరి నిమిషంలో జరగాల్సిన సమావేశాన్ని అధికారులు 27కు వాయిదా వేశారు. అయితే ఇప్పటికే రూ.26కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉండగా వీటితో పాటు రూ.18కోట్లతో పూర్తి అయిన పనులకు ఇంజినీరింగ్ విభాగం రికార్డులు చేయాల్సి ఉండగా, మరో రూ.17కోట్ల పనులు కొనసాగుతున్నాయి. రూ.11.70కోట్ల నిధులతో పనులు మొదలు పెట్టాల్సి ఉంది. కానీ మున్సిపాలిటీలో రూ.30 కోట్ల వరకే నిధులున్నట్లు సమాచారం. దీంతో అప్పులు ఎలా చెల్లింపులు చేయాలా? పెండింగ్ పనులను ఏవిధంగా పూర్తిచేయాలి, వార్డులకు నిధుల కేటాయింపులు ఎలా అనే దానిపై అధికారులు తలలు పట్టుకున్నారు. చివరి సమావేశం అసంపూర్తిగానే ముగిసే అవకాశాలు ఎక్కువ ఉన్నట్లు అధికారులు అంటున్నారు.

యూసుఫ్‌గూడలో క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్..

జూబ్లీహిల్స్,డిసెంబర్ 19 : పబ్లిక్ టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచేందుకు జీహెచ్‌ఎంసీ నెలరోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేసింది. క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్ (సీటీసీ) లో భాగంగా నవంబర్ 26 నుంచి డిసెంబర్ 25 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని జీహెచ్‌ఎంసీ 19వ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ సాల్మన్ తెలిపారు. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీఓటీ) పద్ధతిలో టాయిలెట్ క్లీనింగ్ కార్యక్రమం చేపడుతున్నామని.. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 4 బెస్ట్ టాయిలెట్లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. గురువారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా టాయిలెట్లు పరిశుభ్ర పరిచే పనులను జీహెచ్‌ఎంసీ సిబ్బంది చేపట్టారు.

వేర్వేరు ఘటనలో.. ఇద్దరు అదృశ్యం

సత్యభామ(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 19: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ గృహిణి కనిపించకుండా పోయిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధుబన్ కాలనీకి చెందిన శరద్‌మోహన్, సత్యభామ భార్యాభర్తలు. వీరికి ఓ అబ్బాయి, అమ్మాయి. ఈ నెల 15న శరద్‌మోహన్ పనికి వెళ్లగా, మధ్యాహ్నం 3 గంటల సమయంలో సత్యభామ ఇద్దరు పిల్లలను ఇంట్లో వదిలి వెళ్లిపోయింది. అనంతరం కూతురు శరత్ మోహన్‌కు ఫోన్ చేసి అమ్మ కనిపించడం లేదని సమాచారం అందించారు. వెంటనే ఇంటికొచ్చి సత్యభామ కోసం చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేశారు. ఎలాంటి ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...

భారతీ(ఫైల్)

ఇద్దరు పిల్లలను తీసుకొని ఓ గృహిణి ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన ఈశ్వర్‌రావు, భారతీ భార్యాభర్తలు. వీరికి ధనుష్(7), పూర్ణచందర్(8) సంతానం. ఈ నెల 14న పనికి వెళ్లిన ఈశ్వర్‌రావు రాత్రి ఇంటికొచ్చే సరికి భార్య, పిల్లలు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురై కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికాడు. అయినా వారి ఆచూకీ లభించలేదు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 19: దివ్యాంగుల కోసం జూనియర్, డిగ్రీ కాలేజీ నిర్మించాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్(డీఎస్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ అన్నారు. మలక్‌పేట్‌లో దివ్యాంగుల సంక్షేమ భవన అవరణలో కళాశాల, హాస్టల్ నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని గురువారం ఐఏఎస్ అనితా రామచంద్రన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఉ